**జీవన ప్రవాహంలో**

**మరపురాని మైలురాయి :**

# స్కూలు జీవితం

**శ్రీమతి వై. సీతానాయుడమ్మ**

నాకు తలవని తలంపుగా ఏదో ఒకటి రాయాలని మనస్సు పోతుంది. కాని నాకు తెలియని విషయాలమీదకు నా మనస్సు పోదు. మన జీవితంలో మనం అనుభవించినవి, స్వయంగా చూస్తున్న విషయాలగురించే ఆలోచన. ఆలోచనలు ఎక్కువే కాని కలం మాత్రం కాగితంమీదికి ఎక్కటానికి ఎంతోకాలం పడ్తుంది. ఈ మధ్యలో పాత ఆలోచనలు పోయి కొత్తవి వస్తుంటాయి!

బయట ఎంతో చల్లగా వున్నది కొద్ది వర్షం పడి వెలిసింది. ప్రకృతి ఎంతో నిర్మలంగా కనిపిస్తున్నది. చెట్లు చూడ్డానికి షవర్ బాత్ తీసుకున్నాయా అన్నట్లుగా నిగ నిగలాడుతూ ప్రకృతికి మరింత సౌందర్యాన్నిస్తున్నాయి. ఆ ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ అలా చూస్తున్నాను. నా దృష్టి అంతా ఒక్కసారిగా ఎదురుగా కన్పిస్తున్న స్కూలు పిల్లలమీద పడింది. మాయింటి కెదురే మైనస్కూలు. ప్రక్కన కాన్వెంటు. ఇంకో వైపున వేరే నర్సరీ స్కూలు. ఇంకేమి రోజూ కావల్సినంతమంది పిల్లల్ని చూడవచ్చు. మా పిల్లలిద్దరు యిప్పుడే బడికి వెళ్ళారు. ఇక మా చిన్నివాడు నాదగ్గరవుండి పాపాయిలవైపు వేలుపెట్టి చూపిస్తున్నాడు. పాపాయిలు చూడు చక్కగా ఆడుకుంటున్నారు. అదికావాలన్నట్లుగా ఏడుస్తున్నాడు. ఏమిటి బాబూ! ఏమిటి కావాలి? నీవు గూడా బడికి వెళ్ళి పాపాయిలతో ఆడుకుంటావా? లేదంటూ ఏడ్పు మరికాస్త పెద్దది చేసాడు ఎందుకు ఏడుస్తున్నాడా అని అటూ ఇటూ చూసేసరికి నా దృష్టికి ఒక్కసారిగా ఐస్ క్రీమ్ వాడు కనిపించాడు. మా వాకిట్లోనే పిల్లలంతా ఐస్ క్రీమ్‌వాడిని చుట్టుముట్టి తలొక ఐస్ ఫ్రూట్ కొని తింటున్నారు. మా చిన్ని వాడి దృష్టి దానిమీద పడిందని నాకప్పుడు తెలిసింది. ఓహో! నీకు ఐస్ ఫ్రూట్ కావాలా? అది తింటే నీకు జబ్బుచేస్తుంది. తెలుసా! డాక్టరు ఆంటీ కోపం చేస్తుంది. ఎందుకు తిన్నావని. ఎన్నో చెప్పాను. వింటేకదా! మా చిన్నివాడికోపం వర్ణించాలంటే కష్టం. వాడి సంగతి యింట్లో అందరికీ తెలుసు. అందుకే మా చిన్ని విషయంలో అంతా జాగ్రత్తగా వుంటారు. ఇంకేమున్నది. నా వడిలోనుండి ఒక్కసారిగా క్రిందకి జారి అలిగి పండుకున్నాడు ఇంతలో మా నాయరు రావటం వాడిని క్రిందకు తీసుకెళ్ళటం కూడా జరిగింది. నా దృష్టి మాత్రం ఆ పిల్లలనుండి మరలించలేనట్లుగా చూస్తూనే యున్నాను. ఇంతలో బెల్లు కొట్టేరు, అంతా ఐస్ క్రీమ్ వాడిని వదలి పరుగెడ్తున్నారు. ఎసెంబ్లీకి అంతా హాజరైనారు. ప్రార్థన జరుగుతున్నది.

మరల చిన్న చిన్న తుప్పర పడుతున్నది. పిల్లలు ప్రార్థన మాట మర్చిపోయి తడిసిపోతున్నామని హడావుడి పడ్తున్నారు. పంతులమ్మ కేకలు ప్రార్థన ముగించమని. నాకిదంతా చూస్తుంటే నేను చదువుకునే రోజుల్లో కూడా యిలాంటి చిన్న సంఘటన ఒకసారి జరిగింది. మా కాన్వెంటు మదర్సుకు బాగా తెలుగు రాదు. ఒకరోజు మేమంతా ఎసెంబ్లీలోనుండగా చిన్ని చిన్ని వానచినుకులు పడ్డాయి. మేమంతా గోల చేశాం. ఇక మా హెడ్మిస్ట్రెస్ వచ్చి ఎంత కోపంతో "చిన్న చిన్న వాన చినుకులు పడితే పెద్ద పెద్ద గోలచేస్తారు. పెద్ద పెద్ద బాంబులు పడితే మీరుఏమి చేస్తారంది." ఆమాట నాకు ఒక్కసారిగా గుర్తుకు వచ్చింది. ఇదేకాదు స్కూలు జీవితం ఎప్పటికీ మరపురాదు. ఆ జీవితం తిరిగి రమ్మంటే వస్తుందా!

సెలవులయిపోయాయి. స్కూలు తెరచారు. క్రొత్త బట్టలతోను క్రొత్త పిల్లలతోను, ప్రతి స్కూలు కళ కళలాడుతున్నది. పిల్లలు వున్నదానిలోనే ఎవరికి తగినట్లు వాళ్ళు నీటుగా అలంకరించుకున్నారు. రక రకాల పిల్లలు. రంగు రంగు బట్టలు క్రొత్త క్రొత్త ఫ్యాషన్లు అంతా క్రొత్తే, వాళ్ళకది క్రొత్త జీవితం. ఆజీవితంలో వాళ్ళకంతా ఆనందమే. చదువుకున్నంత

సేపు చదువుకోవటం, ఆడుకోవటం, పాడుకోవటం చూస్తుంటే ఎంతో ముచ్చటగా వుంటుంది.

చిన్న చిన్న పాపాయిలు ఒక బుజాన సంచి తగిలించి ఒక చేత్తో టిఫెన్ క్యారేజీ పట్టుకొని నడుస్తుంటే వాళ్ళవైపే చూడాలనిపిస్తుంది. పెద్ద పిల్లలంతా రెండు జెడలు వేసి రిబ్బన్లు కట్టి తలనిండా పువ్వులు పెట్టి పుస్తకాల సంచి సైకిలుకి తగిలించి వయ్యారంగా సైకిల్ తొక్కుతూ రావటం చూస్తుంటే ఆనందం కల్గించక మానదు

బెల్లు కొట్టగానే పిల్లలంతా వాళ్ళ వాళ్ళ స్నేహితులతో కలసి టిఫన్ క్యారేజీలు పుచ్చుకొని చెట్ల క్రింద చేరి జరిగిన విషయాలన్నీ చర్చిస్తూ భోజనాలు మొదలెడ్తారు. ఇక అలాంటి ఆనందం మనం యింట్లో టేబుల్ దగ్గర కూర్చుని భోంచేస్తే వస్తుందా! భోజనాలంటే జ్ఞాపకానికి వచ్చింది. నాకు మన ఆంధ్రమహిళా సభలో గూడా చదువుకునే అవకాశం కల్గింది. కాని ఉండటం మాత్రం కాన్వెంటు హాస్టల్లో. రోజూ నాకు క్యారేజి పంపించేవాళ్ళు. ఇష్టమున్నా లేకున్నా తిటుండేదాన్ని. నా స్నేహితులిదంతా చూశారు. ఒక స్నేహితురాలు ఒకరోజు ఏదో ఒకటి తీసుకువచ్చి నీకోసరం ప్రత్యేకంగా తీసుకువచ్చాం తింటేకాని వీలుకాదనేవారు. ఇక నాకు తప్పనిసరిగా తినాల్సి వచ్చేది. నా క్యారేజిమాత్రం ఆయా తీసుకువెళ్ళి తింటుండేది. అలాంటి స్నేహితులు మరల దొరుకుతారా! ఆ జీవితంలో వున్నవాళ్ళని, లేనివాళ్ళని తారతమ్యం కనిపించదు. వాళ్ళు కోరేదల్లా రెండే. ప్రేమించటం. ఆనందించటం. అలాంటి ఆనందాన్ని ఎప్పుడూ ఆనందించలేమనే నావూహ. ముసలితనంలో యవ్వనాన్ని కోరుతున్నట్లుగా నాకిప్పటికీ తనివి తీరనట్లుగా వుంటుంది. కాలేజీలో చేరాలి. పిల్లలతో పిల్లనుగా ఆడుకోవాలనిపిస్తుంది. ఎలాకుదుర్తుంది? ఒకవైపు భర్త, ఒకవైపు పిల్లలు. సంసారం వదలి చదవటానకి. అలా చదివేవారు కూడా లేకపోలేదు. అది వాళ్ళ అదృష్టమనే చెప్పాలి. కాని ఒక్క విషయం మాత్రం ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది నాకు. కొందరికి బడికి వెళ్ళాలన్నా, ఉపాధ్యాయులన్నా భయం. ఎవరోదాకా ఎందుకు మావాడికే భయం. ఉదయం లేస్తూనే అమ్మా ఈరోజు బడి వుందా! అని మొదటి ప్రశ్న. ఉన్నదంటే మరల కన్నుమూసి నిద్ర పోతాడు. లేదంటే చక్కగా నిద్ర మేల్కొంటాడు. పోనీ వాడికి చిన్నవయసు అనుకుందాం. ఇక పెద్దవాళ్ళే అలా చేస్తుంటారండే ఆశ్చర్యం కల్గించక మానదు. ఎందుకు భయం? పాఠాలు చదవటంలేదు, కొప్పడ్తాము. అంతేకదూ. పోనీ చదువుకొని వెళ్ళగూడదూ. చెప్పిన విషయాలు చేస్తుంటే యింట్లో అమ్మకు ఎంత ఆనందంగా వుంటుందో అలాగే బడిలో మాష్టర్సుకూ ఆనందంగావుంటుంది.

స్కూలు ఒక సమిష్టి కుటుంబంలాంటిది విద్యార్థులు బిడ్డలులాంటివాళ్ళు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులు. చీకూ చింతా లేని సుఖజీవితం గడపాలంటే స్కూలుజీవితమే. మన సంసార జీవితంగూడా అలా సమిష్టి కుటుంబంలాగా వుంటే ఎంతబాగుండును. ఎక్కడో రష్యాలో అలాంటి ఆనందాలు వున్నాయని మనం తలుచుకొని మురిసిపోవటమే గాని మనకు మనమే మిగులుతున్నాం.

బిడ్డలు చదువుకొని యింటికివస్తారని టిఫిను వేడిగా పెట్టి ఎదురుచూస్తుంటుంది. మాటలో మాట. అదిగో మా పిల్లలు గేటుదగ్గరనుండే కేకలు అమ్మా లే అంటూ!

---

## ఆంధ్ర మహిళా సభ —

**ఆవరణలో ప్రతీ రోజూ బీద— బాల బాలికలకు జరుగుచున్న పాల పంపకం-**

**అక్టోబరు —నెలలో 4972 మందికి పాలుపంచబడెను**

**ఈ పాల పంపకం ప్రతీ రోజు ఉదయం 7 గంటలకు జరుగుచున్నది.**

**శని, ఆదివారములు నూకల గంజి కూడా పోయుట జరుగుచున్నది.**